సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 17 । నవంబర్ । 2024

డోలీ మోత కష్టాలు



గిరి శిఖర గ్రామాల్లోని ఆదివాసీలకు డోలీ కష్టాలు తప్పడం లేదు. రోడ్ల సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. 8లో



కదంతొక్కిన అంగన్‌వాడీలు

మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేస్తూ మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు కదం తొక్కారు. 8లో



పర్యాటకులకు శుభవార్త

పొల్లూరు జలపాతం వద్దకు శనివారం నుంచి పర్యాటకులను అనుమతిస్తున్నారు. ఈ మేరకు డీఎఫ్‌వో బబిత ఆదేశాలిచ్చారు. 8లో

ఉప్పొంగెలే గోదావరి, ఊగిందిలే చేలోవరి, భూదారిలో నీలాంబరి, మా సీమకే చీనాంబరి, వెతలు తీర్చే మా దేవేరి, వేదమంటి మా గోదారి, శబరి కలిసినా గోదారి, రామచరితకే పోదారి అంటూ గోదావరిపై సాగే పాపికొండల విహారం ఎంతో ఆహ్లాదంతో పాటు మరుపురాని మధురానుభూతినిస్తుంది. గలగల పారే గోదారిలో వడి వడిగా లాంచీ ప్రయాణం , గోదారమ్మను అనుకుని పచ్చని కొండలు. ఆహ్లాదాన్నిచ్చే ఇసుక తిన్నెలు. చల్లగా తాకే పిల్ల గాలులతో సాగే పాపికొండల ప్రయాణం ఓ అద్భుతమనే చెప్పాలి.



SUNDAY SPECIAL

వీకెండ్ ఎంజాయ్‌గా పాపికొండల విహారయాత్ర

మధురానుభూతి పొందుతున్న ప్రకృతి ప్రేమికులు

బిజీలైఫ్‌లో ఆహ్లాదం

అలల గోదారిపై హాయిహాయిగా..

చింతూరు: వీకెండ్‌లో ఎంజాయ్ చేసేందుకు పాపికొండల విహారయాత్రపై పర్యాటకులు అధికంగా మక్కువ చూపుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరి అలలపై లాంచీలో సాగే ఈ ప్రయాణం ఎంతో కనువిందు చేస్తుంది. నిత్యం బిజీలైఫ్ గడిపేవారికి వీకెండ్‌లో ఒకరోజు పాటు సెల్‌ఫోన్ సిగ్నల్స్‌కు దూరంగా సాగే ఈ లాంచీ ప్రయాణం మానసిక ఒత్తిడి నుంచి బయటపడేస్తుంది.

- పెద్దలతో పాటు పిల్లలు ఈ లాంచీ ప్రయాణాన్ని ఎంతో ఎంజాయ్ చేస్తారనడంలో అతిశయోక్తి లేదు. పాపికొండల విహార యాత్ర కోసం ఎన్నో ఆధునికమైన ఏసీ లాంచీలు అందుబాటులో ఉన్నాయి.

పాపికొండల యాత్ర ఇలా..

జిల్లాలో పాపికొండల విహారయాత్రకు వెళ్లేందుకు రెండు మార్గాలు ఉన్నాయి. వీఆర్‌పురం మండలం పోచవరం బోట్ పాయింట్ ఒకటి కాగా, దేవీపట్నం మండలం పోచమ్మగండి పాయింట్ మరొకటి.

- యాత్రకు టికెట్ బుక్ చేసుకునేందుకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సౌకర్యం ఉంది. పోచవరం నుండి పాపికొండలకు టికెట్ ధర పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750 వసూలు చేస్తున్నారు. పోశమ్మగండి నుంచి ఈ ధర పెద్దలకు రూ.1,250, పిల్లలకు రూ.1,050గా ఉంది. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ పర్యాటకులకు ఇస్తారు.
- తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు పోచవరం పాయింట్‌కు వచ్చి లాంచీ ఎక్కాల్సి ఉంటుంది. ఉదయం 9.30 నుంచి ఇక్కడ బోట్లు బయలుదేరుతాయి. ప్రస్తుతం ఇక్కడినుంచి ఒక ప్రభుత్వ బోటు, 19 ప్రైవేటు బోట్లు అందుబాటులో ఉన్నాయి.
- రాజమండ్రి వైపు నుంచి వచ్చేవారు పోశమ్మగండి పాయింట్‌కు చేరుకుంటే ఇక్కడినుంచి ఉదయం 9 గంటలకు బోట్లు బయలుదేరుతాయి. ప్రస్తుతం ఇక్కడ 12 ప్రైవేటు, ఒక ప్రభుత్వ బోట్లు అందుబాటులో ఉన్నాయి.
- పోశమ్మగండి నుండి బయలుదేరే బోట్లు పాపికొండలు మీదుగా పేరంటాలపల్లి చేరుకుని అక్కడినుంచి తిరిగి పోశమ్మగండికి వస్తాయి. పోచవరం నుంచి బయలుదేరే బోట్లు పేరంటాలపల్లి మీదుగా పాపికొండలు, సిరివాక వరకు వెళ్లి తిరిగి పోచవరం చేరుకుంటాయి.
- పాపికొండల పర్యటనలో ఎన్నెన్నో ప్రకృతి అందాలు పర్యాటకులను కట్టి పడేస్తాయి. ఎత్తయిన కొండలు ఎంతో కనువిందు చేస్తాయి. పేరంటాలపల్లిలోని పురాతన శివాలయ దర్శనంతో పాటు అక్కడి జలపాతం, అక్కడ లభ్యమయ్యే కొండరెడ్ల వెదురు వస్తువులు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయి.



పోచవరం బోటింగ్ పాయింట్ వద్ద పర్యాటకుల సందడి



లైఫ్ జాకెట్లు ధరించి బోటులో పాపికొండలు విహారానికి వెళ్తున్న పర్యాటకులు

వీకెండ్‌లో రద్దీ



సాధారణ రోజుల్లో పర్యాటకుల సంఖ్య వందకు తక్కువగానే ఉంటోంది. సెలవు రోజుల్లో మాత్రం 250 నుంచి 300 మంది వరకు వస్తున్నారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రక్షణ చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి పర్యాటకుడి వివరాలు సేకరించడంతో పాటు పర్యాటకం సజావుగా సాగేలా పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సహకారం తీసుకుంటున్నాం.

– చిచ్చుడి రాజేష్, ఇన్‌చార్జి మేనేజర్, పోచవరం కంట్రోల్ రూం

మీరంతా ఐఏఎస్‌లు కావాలి

- 'కలెక్టర్ విత్ కాఫీ'లో దినేష్‌కుమార్ ఆకాంక్ష
- విద్యార్థినీ విద్యార్థులతో మమేకం
- స్ఫూర్తి నింపిన ప్రసంగం
- ఇక నుంచి ప్రతి శనివారం నిర్వహణ



ఆంగ్ల నిఘంటువులు, జనరల్ నాలెడ్జి పుస్తకాలు పొందిన విద్యార్థులతో కలెక్టర్

సాక్షి,పాడేరు: ఆయన జిల్లా ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉంటారు. అయినప్పటికీ విద్యార్థులతో మమేకం అయ్యేందుకు కొంత సమయం కేటాయించారు కలెక్టర్ దినేష్‌కుమార్. తన కుటుంబ నేపథ్యాన్ని వారికి వివరించారు. ఉన్నతస్థాయికి ఎదగడానికి ప్రతిభ ఉంటే సరిపోతుందని.. మరేవి అడ్డంకులు కావని.. మీరంతా తనలాగే లక్ష్యం నిర్మించుకుని ఐఏఎస్‌లు కావాలని ఆకాంక్షిస్తూ వారిలో స్ఫూర్తిని నింపారు. ఈ వినూత్న కార్యక్రమానికి కలెక్టర్ బంగ్లా ఆవరణ వేదికైంది. శనివారం ఆయన కలెక్టర్ విత్ కాఫీ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న పాడేరు పట్టణ పరిధిలోని తలారిసింగి, లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి కాఫీ తాగారు. అనంతరం వారితో ఆప్యాయంగా మాట్లాడారు. విద్యార్థుల కుటుంబ నేపథ్యాన్ని తెలుసుకున్నారు.

తల్లిదండ్రులకు సాయపడాలి

తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతుంటారని, తీరిక సమయంలో వారికి సాయపడాలని కలెక్టర్ కోరారు. తాను కూడా రైతు కుటుంబం నుంచే వచ్చానని, తనది తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని మానురు గ్రామమన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చదివానని, కొంతకాలం ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేశానని వివరించారు. అనంతరం సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యానన్నారు. సివిల్స్ సర్వీసెస్‌కు దేశవ్యాప్తంగా 12 నుంచి 13 లక్షల మంది హాజరవుతారని, వారు సాధించిన ర్యాంకుల ఆధారంగా సర్వీసులు వస్తాయన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ అధికారులుగా నియమిస్తారని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

క్రికెట్, బ్యాడ్మింటన్ ఆడుతా..

తనకు ఇద్దరు అన్నలు, సోదరి ఉన్నారని కలెక్టర్ వివరించారు. వీరిలో ఇద్దరు అన్నలు డిగ్రీ వరకు చదువుకున్నారని, స్వగ్రామంలోనే వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. సోదరికి వివాహం జరిగి చెన్నైలో ఉంటున్నారన్నారు. తాను క్రికెట్, బ్యాడ్మింటన్ ఆడుతానని చెప్పారు. విద్యార్థులు ఆడుతున్న క్రీడలను కలెక్టర్ తెలుసుకున్నారు. పాఠ్య పుస్తకాలు కాకుండా ఏఏ పుస్తకాలు చదువుతారని విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం వారికి ఆంగ్ల నిఘంటువు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందజేశారు. ఇప్పటి నుంచి చదువుపై బాగా దృష్టి పెట్టి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఇక నుంచి కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రతి శనివారం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ ఎల్ రజని తదితరులు పాల్గొన్నారు.



కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమంలో గిరిజన విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

న్యూస్‌రీల్

మెరకచింత డిప్యూటీ వార్డెన్ సస్పెన్షన్

- మెరకచింత ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బియ్యం పక్కదారిపై చర్యలు
- హెచ్ఎంకు షోకాజ్ నోటీసు
- గిరిజన సంక్షేమశాఖ డీడీ రజని

హుకుంపేట: మండలంలోని మెరకచింత ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల డిప్యూటీ వార్డెన్ ఎం.కోటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ ఎల్.రజని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి పాఠశాల నుంచి 20 బస్తాల బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా బాకూరు గ్రామస్తులు పట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ ఎల్.రజని శనివారం విచారణ నిర్వహించారు. పట్టుకున్న బియ్యం మెరకచింత పాఠశాలకు చెందినవిగా ఆమె గుర్తించారు. ఐటీడీఏ పీవో అభిషేక్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సూచనల మేరకు డిప్యూటీ వార్డెన్‌ను సస్పెండ్ చేశామని రజని తెలిపారు. సంజాయిషీ కోరుతూ హెచ్ఎం ఎస్.శాంతకుమారికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు ఆమె పేర్కొన్నారు.

ఆక్రమణలు తొలగించాల్సిందే

- కలెక్టర్ దినేష్‌కుమార్
- హైవే నిర్మాణం నేపథ్యంలో పాడేరులో ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిశీలన
- ఎస్పీ అమిత్‌బర్దర్‌తో కలిసి కాలినడకన పర్యటన




ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో నడుస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్, అధికారులు

సాక్షి,పాడేరు: జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన ఎస్పీ అమిత్ బర్దర్, ఇతర అధికారులతో కలిసి స్థానిక పాత బస్టాండ్ అంబేడ్కర్ సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు వరకు కాలినడకన పర్యటించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేసిన వ్యాపారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది ఆర్‌అండ్‌బీ స్థలాలను అద్దెకు ఇవ్వడాన్ని వారు గుర్తించారు. ఇటీవల కాయగూరల దుకాణం ఏర్పాటుపై ఆగ్రహానికి గురైన కలెక్టర్ మూడు రోజుల్లో తొలగించాలని ఈవోఆర్డీ రమేష్‌కు సూచించారు. రైతుబజార్‌ను వినియోగంలోకి తెచ్చి రోడ్డు పక్కన కూరగాయల దుకాణాలను అక్కడకు తరలించాలని ఆదేశించారు. సీజన్‌లో రగ్గులు అమ్ముతున్న వ్యాపారులకు వేరే ప్రదేశం కేటాయించాలని సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్‌కు సూచించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు జాతీయ రహదారిగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆక్రమణలు తొలగించి స్థలాలు ఇవ్వాల్సిందేనన్నారు. సొంత స్థలంలో వ్యాపారాలు ఉన్నవారికి రహదారిపై కాకుండా మరో అంతస్తు నిర్మాణానికి నిబంధనల ప్రకారం అనుమతులు ఇస్తామన్నారు. పాడేరు అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తామన్నారు. రోడ్డు ఆక్రమణలపై ముందుగా అవగాహన కల్పిస్తామని, తరువాత నోటీసులు జారీ చేస్తామన్నారు. అప్పటికి స్పందన లేకపోతే ఆక్రమణలు తొలగిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, తహసీల్దార్ త్రినాథరావునాయుడు, డీపీవో లవరాజు, సీఐ దీనబంధు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి పాల్గొన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన తప్పనిసరి

- ప్రతిరోజు దిన పత్రికలు చదివితే మరింత విజ్ఞానం
- ఎస్పీ అమిత్ బర్దర్
- వర్క్‌షాప్ విజయవంతం



వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న ఎస్పీ అమిత్ బర్దర్



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐడీ ఉన్నతాధికారి ప్రేమ్‌కాజల్, ఉన్నతాధికారులు



ఎస్పీ అమిత్ బర్దర్‌ను సత్కరిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

జి.మాడుగుల: విద్యార్థులకు గిరిజన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, మరింత విజ్ఞానం పొందేందుకు ప్రతిరోజు దినపత్రికలు చదవాలని ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. సీఐడీ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రీజనల్ ఆఫీసర్ జి.ప్రేమ్ కాజల్ అధ్యక్షతన జి.మాడుగులలో శనివారం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు అత్యాచార నిరోధక చట్టంపై ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, నేర రహితంగా జిల్లా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. రామాయణం, మహాభారతం వంటి వాటిపై విద్యార్థులు అవగాహన పొందాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడం విద్యార్థులు, ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు బాధ్యతగా చేపట్టాలన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ బి. వేణుగోపాల్, గిరిజన సంక్షేమశాఖ పాడేరు డీడీ రజని ప్రసంగించారు. అత్యాచార నిరోధక చట్టంపై విద్యార్థులకు ప్రేమ్‌కాజల్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీని శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి సత్కరించారు. విద్యార్థులకు పోటీపరీక్ష నిర్వహించి బహుమతులు అందజేశారు. తహసీల్దార్ లత్సాపాత్రుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.ప్రసాద్‌నాయుడు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు రాజన్న, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివ సత్యనారాయణ, సీఐడీ సీఐలు జీవీ రమణ, పీవీవీ నర్సింహారావు, సీహెచ్ రుద్రశేఖర్, ఎస్ఐ షణ్ముఖరావు, సీఐడీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్యాటకులకు శుభవార్త

- పొల్లూరు జలపాతం వద్దకు అనుమతి


జలపాతం వద్ద బారులు తీరిన వాహనాలు

మోతుగూడెం: చింతూరు డీఎఫ్‌వో బబిత ఆదేశాల మేరకు లక్కవరం రేంజ్ అధికారి జీవీ నానాజీ ఆధ్వర్యంలో శనివారం నుంచి పొల్లూరు జలపాతానికి పర్యాటకులను అనుమతించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ జలపాతం వద్దకు వచ్చే పర్యాటకులు అటవీశాఖ సూచించిన నిబంధనలు పాటిస్తూ తద్వారా ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా ఉండాలన్నారు. అటవీశాఖ వారికి అన్ని వేళలా సహకరించాలని కోరారు.

బావిలో పడి మహిళ మృతి


కాశీపురంలో నూతిలో లక్ష్మి మృతదేహం

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం శివారు చిటిమిరెడ్డిపాలెంకు చెందిన చిటిమిరెడ్డి లక్ష్మి (57) బావిలో పడి మృతిచెందిన ఘటన శనివారం వెలుగు చూసింది. కాశీపురం సచివాలయానికి సమీపంలో తారురోడ్డుకు ఆనుకొని ఉన్న బావిలో చిటిమిరెడ్డి లక్ష్మి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సచివాలయ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మృతురాలు లక్ష్మి భర్త సత్తిబాబు మూడేళ్ల క్రితం మరణించాడు. లక్ష్మికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరు తమ కుటుంబాలతో విశాఖపట్నంలో ఉంటున్నారు. చిటిమిరెడ్డిపాలెంలో ఒంటరిగా ఉంటున్న లక్ష్మి ఈ నెల 14వ తేదీ సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించడానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఈ క్రమంలోనే ప్రమాదవశాత్తు నూతిలో పడి మృతి చెంది ఉంటుందని హెడ్‌కానిస్టేబుల్ పైడిరాజు విలేకరులకు తెలిపారు. మృతదేహం నుంచి దుర్వాసన రావడంతో రెండు రోజుల క్రితమే బావిలో పడి మృతి చెంది ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి, శవ పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టానికి ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు నానిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ పైడిరాజు తెలిపారు.

వాడీవేడిగా మండల సమావేశం


డుంబ్రిగుడ మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాకా ఈశ్వరి


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు


జి.మాడుగులలోని సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి

డుంబ్రిగుడ: మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం వాడివేడిగా జరిగింది. సమావేశానికి సమయపాలన పాటించని, గైర్హాజరైన అధికారులపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి గైర్హాజరవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌ను సభ్యులు నిలదీశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవడానికి కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని ప్రకటించడంతో సభ్యులు సమావేశాన్ని కొనసాగించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా చూడాలని, వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్‌లు హరి, సునీత, సుబ్బారావు, కొములు తదితరులు ఎంఈవో సుందర్‌రావును కోరారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు పనులను పూర్తి చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. పంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను ముందస్తుగా ప్రజాప్రతినిధులకు అధికారులు తెలియజేయాలన్నారు. వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్‌రావు, పి. లలిత, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, డీటీ ముజీబ్, ఎంఈవో శెట్టి సుందర్‌రావు, ఎంపీటీసీ సభ్యులు రామరావు, జెమ్మ, గీత, దేవాదాసు, విజయ, పద్మ, సర్పంచ్‌లు నాగేశ్వరావు, సీడీపీవో నీలిమ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో రోడ్లు, తాగునీరు, పాఠశాల భవనాలు వంటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించాలని జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కళ్యాణి అధ్యక్షతన జరిగింది. మండలంలో సోలార్ వాటర్ పథకాలు, కొన్ని గ్రామాల్లో మంచినీటి పథకాలు పని చేయకపోవటంతో గ్రామస్తుల ఇబ్బందులు పలువురు సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. పలు పాఠశాలలకు భవనాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తెలిపారు. మారుమూల గ్రామాలకు రోడ్లు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ సభ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను సంబంధిత ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంపీడీవో తేజీరతన్, ఎంఈవో బాబూరావుపడాల్, హౌసింగ్ ఏఈ ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం


కొమ్ములవాడ పాఠశాలలో విద్యార్థులు


విద్యార్థులతో ఉపాధ్యాయురాలు

సాక్షి ఎఫెక్ట్..

గూడెంకొత్తవీధి: ఎట్టకేలకు మండలంలోని 11 పాఠశాలలకు డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించారు. 11కి పైగా జీపీఎస్ పాఠశాలల్లో గతంతో పనిచేసిన సీఆర్‌టీలను ప్రభుత్వం రెగ్యులర్ చేసి, ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. ఆగస్టులో బదిలీ అయినా వీరి స్థానంలో ఎవరినీ నియమించలేదు. దీంతో సుమారు మూడునెలలుగా ఆయా పాఠశాలల విద్యార్థులు చదువులకు దూరమయ్యారు. అధికారులకు విద్యార్థుల తల్లిదండ్రులు వినతులు ఇచ్చినా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ఈ నేపథ్యంలో 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. కలెక్టర్, ఐటీడీఏ పీవోల దృష్టికి సమస్యవెళ్లడంతో వారు డీఈవోతో మాట్లాడి తక్షణమే డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, అవసరమైన చోట సీఆర్‌టీలను నియమించాలని ఆదేశించారు. దీంతో మండలంలోని ఈతర్రొబ్బలు, తూరుమామిడి, వాడమామిడి, తడకపల్లి, కొమ్ములవాడ, అగ్రహారం, పేట్రాయితో తదితర జీపీఎస్ పాఠశాలల్లో డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించినట్టు మండల విద్యాశాఖ అధికారి రామన్న తెలిపారు. 'సాక్షి' కథనాల కారణంగా తమ గ్రామాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించారని ఆయా గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

16 కిలోల గంజాయి పట్టివేత


నిందితులతో పోలీసులు

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం స్కూటీపై తరలిస్తున్న 16 కిలోల గంజాయిని పట్టుకుని, ఓ యువకుడిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన కాగిత జశ్వంత్ అనే యువకుడు స్కూటీపై గంజాయి తరలిస్తున్న సమయంలో అల్లూరి పార్కు వద్ద పట్టుకుని, కోర్టుకు తరలించినట్టు చెప్పారు. జశ్వంత్ నుంచి గంజాయితో పాటు స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

డోలీ మోత కష్టాలు

రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న బూసిపాడు గిరిజనులు

అనంతగిరి (అరకులోయ రూరల్): గిరి శిఖర గ్రామాల్లోని ఆదివాసీలకు డోలీ కష్టాలు తప్పడం లేదు. రోడ్ల సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. మండలంలో కొత్తూరు పంచాయతీ గిరి శిఖర గ్రామమైన బూసిపాడులో పేరంగి జానిబాబు శనివారం స్పృహ తప్పి పడిపోయాడు. ఆ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అతన్ని ఆస్పత్రికి తరలించేందుకు అష్టకష్టాలు పడ్డారు. డోలీలో గిరి శిఖరం మీదుగా గుమ్మ పంచాయతీ కరివేసు గ్రామం వరకు సుమారు మూడు కిలోమీటర్ల పాడవునా డోలీలో మోసుకువచ్చారు. అక్కడి నుంచి ఓ ప్రైవేట్ వాహనంలో ఎస్.కోట ఆస్పత్రికి తరలించినట్టు జానిబాబు బంధువులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం గిరి శిఖర గ్రామాల గిరిజన ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా ఉపాధి హామీ పథకం, జీఎస్‌పీ నిధులు రూ.44 లక్షలు మంజూరు చేసిందన్నారు. కృష్ణపురం, శివలింగపురం గ్రామాలకు సమీపంలో కూతవేటు దూరంలో రైల్వే ట్రాక్ ఉందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించి బూసిపాడు గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించవచ్చన్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీవోలు చొరవతీసుకుని ఈ దిశగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

భక్తిశ్రద్ధలతో దీపార్చన


పూతిగుంట పరమేశ్వరుని ఆలయంలో లింగదీపార్చన చేస్తున్న భక్తులు


గురమంద విశ్వనాథుని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వై.రామవరం: మండలంలోని పూతిగుంట పరమేశ్వరుని, గురమంద విశ్వనాథుని ఆలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి భక్తులు లింగదీపార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా ఆలయాలు శివనామ స్మరణంతో మార్మోగాయి.

జ్వాలాతోరణం వద్ద అపశ్రుతి



ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులు

అనకాపల్లి: కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక గొల్లవీధి శివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జ్వాలా తోరణం కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారి పల్లకీని వీధుల్లో ఊరేగించిన అనంతరం జ్వాలాతోరణం కింద నుంచి తీసుకువెళ్తున్న సమయంలో పల్లకీని మోస్తున్న భక్తులు పడిపోయారు. దీంతో గొల్లవీధికి చెందిన ముగ్గురికి స్వల్పంగా కాలినగాయాలయ్యాయి. వారిని హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడే చికిత్స పొందుతున్నారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- పాడేరు, రంపచోడవరంలో ఆందోళన


పాడేరులో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


రంపచోడవరంలో ఐటీడీఏ పీవో సింహాచలంకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సాక్షి,పాడేరు: మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేయాలని డిమాండ్ చేస్తూ మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు కదం తొక్కారు. పాడేరు డివిజన్‌లోని వీరంతా శనివారం ఆందోళన చేపట్టారు. వీరికి సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్లు హెల్పర్ల యూనియన్ ప్రతినిధులు, మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలు మద్దతు ఇచ్చారు. వీరంతా ఐటీడీఏ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.నాగమ్మ, వి.భాగ్యలక్ష్మి, సీఐటీయూ నేత సుందరరావు మాట్లాడారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్తలంతా వెట్టి చాకిరి గురవుతున్నారని, కార్యకర్తలుగా, ఆయాలుగా రెండు విధులు వారే నిర్వహిస్తున్నారన్నారు. పని భారం అధికమైందని, అందువల్ల మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలన్నారు. అంతేకాకుండా మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా, గ్రేడ్-2 సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ సిబ్బందికి రూ.26 వేల చొప్పున వేతనాలు పెంచాలన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో డిసెంబర్ 12 నుంచి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

రంపచోడవరం: మినీ అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ ఎదుట శనివారం ఆందోళన చేశారు. సీఐటీయూ కార్యాలయం నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఐటీడీఏ ఎదుట బైఠాయించారు. మూడు గంటల పాటు ధర్నా చేశారు. పీవో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఐటీడీఏ కార్యాలయంలోకి దూసుకువెళ్లారు. ఈ పరిస్థితుల్లో వారికి పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. అంగన్‌వాడీ,హెల్పర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జీ బేబీరాణి, సీఐటీయూ జిల్లా మట్ట వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, కె శాంతిరాజు, నిర్మల పాల్గొన్నారు.

రెండు వ్యాన్లు దగ్ధం


ఆర్.శివరాంపురంలో కాలిపోతున్న వ్యాన్లు

బుచ్చెయ్యపేట: మండలంలోని ఆర్.శివరాంపురంలో నమ్మి తాతాజీ అనే వ్యక్తికి చెందిన రెండు వ్యాన్లు దగ్ధమయ్యాయి. గ్రామంలో రోడ్డు పక్కన ఉంచిన రెండు వ్యాన్ల నుంచి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత రెండు గంటల ప్రాంతంలో మంటలు ఎగసిపడడాన్ని స్థానికులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు బాధితుడు తాతాజీ బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ శ్రీనివాసరావు విచారణ చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్


ప్రమాదానికి గురైన లారీ

బుచ్చెయ్యపేట: మండలంలోని నీలకంఠాపురం గ్రామ శివారులో టిప్పర్ లారీ ఢీ కొనడంతో ఓ విద్యుత్ స్తంభం విరిగిపోయింది. శనివారం తెల్లవారుజామున కశింకోట-బంగారుమెట్ట(కేబీ) రోడ్డులో బుచ్చెయ్యపేట నుంచి అనకాపల్లి వైపు రాయి లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

భార్యా భర్తలపై కత్తితో దాడి

- మద్యం మత్తులో నిందితుడి ఘాతుకం
- భార్య చేతికి తీవ్ర గాయం


కత్తి దాడిలో చేతిపై తీవ్ర గాయం

హుకుంపేట: మండలంలోని తాడిపుట్టు పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో శనివారం భార్యా భర్తలపై కత్తితో దాడి చేసిన సంఘటన సంచలనం రేపింది. దీనికి సంబంధించిన వివరాలు.. కూడ రత్నాలమ్మ, కృష్ణబాబు దంపతులు తమ పొలం పనులను ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో పసువుల కోసం ఉంచిన గడ్డిని అదే గ్రామానికి చెందిన తమర్బ చిన్న కొండపడల్ కాల్చి బూడిద చేశాడు. గడ్డిని ఎందుకు దహనం చేశావని రత్నాలమ్మ, కృష్ణబాబు అతనిని నిలదీయగా మద్యం మత్తులో ఉన్న కొండపడల్ కోపోద్రిక్తుడై కత్తితో దంపతులను నరకబోయాడు. ముందుగా భర్తపై కత్తితో దాడి చేయగా.. అతని చేతికి గాయమై పరుగులు తీశాడు. వెంటనే పక్కనున్న భార్య రత్నాలమ్మను నరకపోగా తప్పించుకునేందుకు యత్నించింది. ఆమె చేతికి తీవ్రమైన గాయాలవగా స్పృహ తప్పి కింద పడిపోయింది. గమనించిన గ్రామస్తులు హుటాహుటిన 108 వాహనానికి సమాచారం అందించి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు గతంలో ఇదే గ్రామంలో పలు తగదాల కేసుల్లో శిక్ష అనుభవించి బయటకు వచ్చాడని, ఇటువంటి వ్యక్తులు గ్రామంలో ఉంటే ప్రాణాపాయం ఉంటుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తండ్రి కళ్లముందే మృత్యు ఒడికి..

- తండ్రి వెంట పరుగులుతీసి బస్సు ఢీకొనడంతో దుర్మరణం
- అగనంపూడి జాతీయ రహదారిపై ఘోర సంఘటన
- శోకసంద్రంలో తల్లిదండ్రులు, బంధువులు


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బాలుడు (ఇన్‌సెట్) మృతుడు పవన్‌కుమార్ (ఫైల్)

అగనంపూడి: ఇక్కడి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం అందరినీ కన్నీరు పెట్టించింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు కళ్లముందే ముందే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి పోలీసుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడలోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న దేముళ్లు, భార్య దేవి, కుమార్తె వెంకటి, కుమారుడు పవన్‌కుమార్ స్థానిక బీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. కాలనీకి సమీపంలోనే సాధన పబ్లిక్ స్కూల్‌లో పవన్, ప్రభుత్వ పాఠశాలలో కుమార్తె ఏడవ తరగతి చదువుతోంది. ఎప్పట్లాగే కుమారుడు పవన్‌ను దేముళ్లు పాఠశాల వరకు తీసుకెళ్లారు. లోపలకు వెళ్లిపొమ్మని చెప్పి అక్కడి నుంచి పరవాడ ఫార్మా కంపెనీకి వెళ్లేందుకు బస్సు కోసం ఆయన జాతీయ రహదారి దాటుతుండగా కుమారుడు వెంట పడ్డాడు. అదే సమయంలో లంకెలపాలెం నుంచి గాజువాక వైపు వస్తున్న ఫార్మా కంపెనీ బస్సు పవన్‌ను ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అప్పటి వరకు తనతో కలిసి ఉన్న కుమారుడు కళ్లెదుటే ప్రాణాలు కోల్పోవడంతో తండ్రి దేముళ్ల తట్టుకోలేక పోయాడు. గుండెలివిసేలా రోదించాడు. కుమారుడు మరణవార్త తెలుసుకున్న తల్లి దేవి గుండెలు బాదుకుంటూ సంఘటన స్థలం వద్ద విలపించడం అక్కడున్న వారందరినీ కంట తడి పెట్టించింది. బంధువులు బోరున విలపించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దువ్వాడ సీఐ కిల్లి వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబం సొంతూరు చోడవరం మండలం లక్కవరం పంచాయతీలోని మామిడిపల్లి గ్రామమని బంధువులు తెలిపారు.